









జల విలయం

మేట వేసిన బురద.
పశువుల కళేబరాలు.
విరిగి పడిన కరెంటు స్తంభాలు.
కొట్టుకొచ్చిన ట్రాక్టర్లు, ఆటోలు.
దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలు.
ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు..
బురద మట్టి.
రాయలచెరువు కట్ట తెగడంతో కేవీబీపురం కళత్తూరు దళితవాడలో జలవిలయం సృష్టించిన భీతావహ దృశ్యమిది.

ముందస్తు సమాచారంతో జనం మిద్దెలెక్కారు. ఎత్తయిన చోట్లకు వెళ్లారు. దీంతో ప్రాణనష్టం తప్పింది. సునామీలా విరుచుకు పడిన వరద ఉధృతిలో ఊరటనిచ్చే విషయం ఇది.

- కేవీబీపురం/సత్యవేడు/శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

- రాయల చెరువుకు గండి
- ముంచెత్తిన నీటితో బురదమయమైన కళత్తూరు దళితవాడ
- పాడి పశువులు, జీవాలు మృతి
- ముందస్తు సమాచారంతో తప్పిన ప్రాణనష్టం

గత ప్రభుత్వ నిర్లక్ష్యమే..

పాతపాళెంలో రెండు కొండల మధ్య 153 ఎకరాల విస్తీర్ణంలో రాయల చెరువు ఉంది. మూడు గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. చెరువు నీటి సామర్థ్యం 0.88 టీఎంసీలు. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు పథకంలో భాగంగా చెరువు కట్టను పటిష్ఠ పరిచింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చెరువు కట్టల నిర్వహణను గాలికొదిలేసింది. ఈ నిర్లక్ష్యమే రాయల చెరువు కట్ట తెగడానికి కారణమని స్థానికులు అంటున్నారు. ఈ చెరువు ఖాళీ కావడంతో ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు.

రాత్రి వేళ జరిగి ఉంటే..

రాయల చెరువు కట్ట రాత్రి.. లేదా తెల్లవారుజామున తెగి ఉంటే.. ఈ ఆలోచనకే కళత్తూరు దళితవాడ వణికిపోతోంది. తామంతా నిద్రించే వేళ చెరువు నీరు ముంచెత్తిఉంటే.. ప్రాణాలతో బయటపడే వాళ్లం కాదని అంటున్నారు. సర్వం కోల్పోయినా ప్రాణాలు దక్కాయని చెబుతున్నారు.

సర్వంకోల్పోయిన వారెందరో?

పది అడుగుల మేర నీటి ప్రవాహంతో చాలా ఇళ్లల్లోని వస్తువులు కొట్టుకుపోయాయి. ఇళ్లల్లోని ధాన్యం, బియ్యం, నగదు, సర్టిఫికెట్లు, గృహోపకరణాలు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, ట్రాలీలు, చెనిక్కాయమిషన్ వంటివి నీటిలో కొట్టుకుని ఎక్కడ పడితే అక్కడ చెల్లా చెదరుగా పడ్డాయి.500కుపైగా ఆవులు, గేదెలు చనిపోయినట్లు అంచనా. మిగిలినవి గల్లంతయ్యాయి. మేకలు, గొర్రెలు, కోళ్లు ఎన్ని చనిపోయాయో తెలియదు. కళత్తూరు, కళత్తూరు దళితవాడల్లోని ఇళ్లల్లో బురద పేరుకుపోవడంతో సామాన్లు పనికిరాకుండా పోయాయి. చాలామంది కట్టుబట్టలతో బయటపడ్డారు. వందకుపైగా విద్యుత్‌స్తంభాలు నేలమట్టం అయ్యాయని అంచనా. పంటలు దెబ్బతినగా, పొలాలన్నీ ధ్వంసమయ్యాయి.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

కేవీబీపురంలోని ఆదర్శ పాఠశాల, జడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 900 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. నాలుగురోజుల పాటు వీరికి బస, ఆహారం అందించనున్నారు. ప్రతి కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.3వేలతో పాటు నిత్యావసర సరుకులు అందజేయనున్నారు.



ఆదర్శ పాఠశాలలో..

ఇలా ముంచెత్తింది

గురువారం ఉదయం 6 గంటలు: ఓళూరు రాయలచెరువుకు గండి పడింది. దీనిని గుర్తించిన రైతులు, కూలీలు పాతపాళెం, ఓళూరు, వేమలపూడి, ఎస్ఎల్ పురం, కళత్తూరు ప్రజలను అప్రమత్తం చేశారు. **7 గంటలు:** పాతపాళెం ఎస్టీ కాలనీ నుంచీ కళత్తూరులోకి చెరువునీరు వచ్చింది. **8 గంటలు:** గండి కాస్త పెద్దది కావడం.. కట్ట తెగిపోవడంతో ప్రవాహం ఉధ్రుతంగా మారింది. **9 గంటలు:** వరద.. ఉప్పెనలా మారి కళత్తూరు దళితవాడపై విరుచుకుపడింది. 10 నుంచి 12 అడుగుల ఎత్తు వరకు ప్రవహించింది. ప్రజలు మిద్దెలపై ఎక్కి ప్రాణాలను కాపాడుకున్నారు. **10 గంటలు:** వరద ప్రవాహం కొనసాగుతూ గ్రామాన్ని ముంచెత్తింది. గంటన్నర వ్యవధిలో కకావికలం చేసింది.





కొనసాగుతున్న సహాయక చర్యలు

ఎమ్మెల్యే ఆదిమూలం, ఎస్పీ సుబ్బరాయుడు, ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ గ్రామానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగి వరద నీటి మళ్లింపు, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలను ప్రారంభించారు. కేవీబీపురం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడుకు చెందిన సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. సత్యవేడు, శ్రీకాళహస్తి, పుత్తూరు నుంచి అగ్ని మాపక సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, సమీప గ్రామాల వారు ప్రజలకు ఆహారం, నీరు అందించారు. నిరాశ్రయులకు రైతు సంఘం అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజులనాయుడు తదితరులు మధ్యాహ్న భోజనం, తాగునీటి వసతి కల్పించారు.వ్యవసాయ, పశుసంవర్థక శాఖ అధికారులు నష్టం వివరాలు సేకరిస్తున్నారు.నవంబరు చివరిలో నాట్లు వేసేందుకు రైతులు నార్లు పోస్తున్నారు. దీంతో వేలాది ఎకరాల్లో పంట నష్టం తప్పింది. కాగా, సాయంత్రం కలెక్టర్ వెంకటేశ్వర్ దళితవాడలో పర్యటించి బాధితులతో మాట్లాడారు. ధైర్యం చెప్పారు.









దంచికొట్టిన వాన

చిత్తూరు రూరల్ మండలంలో గురువారం భారీవర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి.గురువారం ఉదయం 11 సమయంలో పొడి వాతావరణం కాస్తా చల్లబడింది. 11.30గంటల సమయంలో తుంపర్లతో మొదలైన వాన ఎడతెరపి లేకుండా మూడు గంటలకు పైగా కురిసింది. దీంతో తాళంబేడు చెరువు పొంగి పొర్లడంతో వాగు, వంకలు నిండి రోడ్లపై ప్రమాదకర స్థాయిలో నీరు ప్రవహించాయి. మండలంలోని దాదాపు చెరువులన్నీ నిండి మొరవ పోతున్నాయి.చిత్తూరు పట్టణ పరిధిలో వర్షం చిరుజల్లులకే పరిమితమైంది.



- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి

పొంగిపొర్లుతున్న వాగులు



ఎస్ఆర్‌పురం మండలంలో గురువారం కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పాతపాళ్యం, పాపిరెడ్డి పల్లె, జీఎంఆర్‌పురం, వడ్డికండ్రిగ, దాసరిగుంట, మిట్ట కండ్రిగ, ఎగువకమ్మకండ్రిగ గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.పాతపాళ్యం వాగు దాట డానికి విద్యార్థులు ఇబ్బంది పడుతుంటే స్థానిక యువకులు మోసుకుంటూ వచ్చి అవతలి వైపునకు చేర్చారు. అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- శ్రీరంగరాజపురం, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో ప్రముఖులు



నీరబ్‌కుమార్ ప్రసాద్

తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ మాజీ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, తెలంగాణ హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ఉన్నారు.


రుయాలో డాక్టర్ల ఘర్షణ

డాక్టర్‌పై చేయి చేసుకున్న మరో వైద్యుడు

విచారణ చేపట్టిన అధికారులు

తిరుపతి(వైద్యం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న డాక్టర్‌పై ప్రైవేటు వైద్య కళాశాలకు చెందిన మరో వైద్యులు దాడికి పాల్పడిన ఘటన గురువారం రుయాస్పత్రిలో చోటుచేసుకుంది. నాలుగు రోజులుగా ఎస్వీ వైద్య కళాశాల పరిధిలో పీజీ డాక్టర్లకు పరీక్షలు జరుగుతున్నాయి. బుధవారం పరీక్షలు ముగిశాయి. అపోలో వైద్యశాలకు చెందిన పీజీ వైద్యులు పరీక్ష ఎలా రాశారు అనే విషయం తెలుసుకునేందుకు ఆ కళాశాల తరఫున ఎగ్జామినర్‌గా వచ్చిన డాక్టర్ శ్రీనివాసులురెడ్డి పరీక్షల విధుల్లో పాల్గొన్న డాక్టర్ శ్రీనివాసులు దగ్గరకు వచ్చారు. ఆయన సరైన సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. గురువారం మళ్లీ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి రుయాస్పత్రిలో విధుల్లో ఉన్న డాక్టర్ శ్రీనివాసులు వద్దకు వచ్చారు. గంటల తరబడి శ్రీనివాసులరెడ్డిని విభాగం ముందే నిరీక్షింపజేశారు. సహనం కోల్పోయిన శ్రీనివాసులరెడ్డి డాక్టర్ శ్రీనివాసులు గదిలోకి వెళ్లి ఆయనపై చేయి చేసుకున్నారు. దీంతో ఇరువురు దాడులకు పాల్పడ్డారు. అక్కడే ఉన్న ఇతర వైద్యులు గుర్తించి సర్దిచెప్పారు. ఈ విషయంపై ఇరువురు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధలకు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. వారు విచారణ చేపట్టారు. దాడి జరిగిన మాట వాస్తవమేనని, కారణాలపై విచారణ చేపడుతున్నామని, పూర్తి వివరాలు తెలుసుకున్నాక తగు చర్యలు చేపడతామని ప్రిన్సిపల్ రవిప్రభు తెలిపారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 8 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.78 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,239

తలనీలాలు సమర్పించినవారు: 23,436



మహిళలకు వరం పింక్ బస్సు

స్విమ్స్‌లోని పింక్ బస్సు ద్వారా 2018 నుంచి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనిలో నోటి క్యాన్సర్‌ను గుర్తించేందు పరీక్షలు, బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణకు రొమ్ము పరీక్ష, మామో గ్రామ్, అల్ట్రా సౌండ్ స్కానింగ్, పెట్ సిటీ, లీనియర్ ఎక్సలేటర్ మొదలగు పరికరాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ గుర్తించేందుకు పాప్ స్మియర్ పరీక్ష కూడా పింక్ బస్సులో అందుబాటులో ఉంది.

పింక్ బస్సు సేవలు

- నిర్వహించిన మొత్తం క్యాంపులు : 692
- స్క్రీనింగ్ చేసిన రోగుల సంఖ్య : 41,783
- చికిత్స తీసుకున్నవారి సంఖ్య: 744(ఆపరేషన్లతో కలిపి)
- 2025లో (జనవరి నుంచి అక్టోబరువరకు) ఓపీల సంఖ్య :21037, ఐపీ :5917



త్వరలో ప్రారంభం కానున్న శ్రీబయో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం :

క్యాన్సర్ భూతం కాదు జబ్బు మాత్రమే



తిరుపతి ఆంధ్రజ్యోతి

క్యాన్సర్ అనే పేరు వింటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఆందోళన, భయం మొదలవుతుంది. క్యాన్సర్ అని నిర్ధారణ అయిన వారితో పాటూ వారి కుటుంబ సభ్యుల్లోనూ, ఆత్మీయుల్లోనూ నిరాశ పేరుకుంటుంది. ఒక అసక్తత అసహనంగా మారుతుంది. అయితే క్యాన్సర్ అన్నది ఇప్పుడు మరణానికి సంకేతపదం కానేకాదు. వైద్యరంగంలో జరిగిన ఆవిష్కరణలు, కనుగొన్న మందులు, అనుసరిస్తున్న వైద్య విధానాలు.. కేన్సర్‌ను నిరోధించడమే కాదు, నియంత్రించగలుగుతున్నాయి. కేన్సర్ అని నిర్ధారణ అయినవారిలో పోరాడి గెలవాలనే పట్టుదల, వారికి స్థైర్యాన్నిచ్చే కుటుంబ సభ్యులు ఉంటే అద్భుతాలు కూడా జరుగుతాయి. క్యాన్సర్ ఎందుకు వస్తుందో కారణాలు అనేకం ఉండచ్చు కానీ మొదట్లోనే గుర్తించి వైద్యం మొదలు పెడితే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. ఇలా చికిత్సతో క్యాన్సర్‌ను జయించిన వారు ఎందరో ఉన్నారు. చివరి స్టేజ్‌లో ఆస్పత్రిమెట్లెక్కి కరెంటు, కీమో థెరపీలతో పోరాడి గెలిచినవారూ ఉన్నారు. కాబట్టి క్యాన్సర్ అన్నది గతంలోలా ఇప్పుడు కబళించే భూతం కాదు. అది కూడా వైద్యంతో నియంత్రించగల ఒక జబ్బు మాత్రమే అని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, స్వీకార్ డైరెక్టర్ ప్రశాంత్ చెబుతున్నారు. తిరుపతిలో క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు తగిన వైద్యం అందుబాటులో ఉందంటూ ఆ వివరాలు తెలియజేశారు.



స్విమ్స్ క్యాన్సర్ విభాగంలో త్వరలో అందుబాటులోకి రానున్న లీనియర్ యాక్సిలేటర్

తిరుపతిలో స్విమ్స్‌తో పాటు టాటా కాన్సర్ (స్వీకార్) ఆస్పత్రులలో క్యాన్సర్ పరీక్షలు, చికిత్స లభిస్తున్నాయి. స్విమ్స్, స్వీకార్ వంటి వైద్య సంస్థలు 'క్యాన్సర్‌ను జయిద్దాం'..అంటూ సామాజిక ప్రచారాలు, వాక్‌థాన్, క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తున్నాయి. డోర్ టూ డోర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాల ద్వారా ముందస్తు గుర్తింపు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో క్యాన్సర్ అని అనుమానం వస్తే నిర్ధారణ కోసం వైద్యనిపుణులు పరీక్షలను సూచిస్తున్నారు. బ్రెస్ట్ కాన్సర్‌పై జాగ్రత్తలు, మహిళలకు స్వీయ పరీక్ష గురించి అవగాహన కలిగిస్తున్నారు. సర్జికల్ చికిత్సతో పాటు కీమోథెరపీ, రేడియోథెరపీలు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా నగదు ఖర్చు లేకుండా అందుతున్నాయి. ఎస్వీఆర్ రుయా ఆస్పత్రిలో సర్జికల్, రేడియేషన్ చికిత్స లేనప్పటికీ ఓపీ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు.

టీటీడీ సాయంతో త్వరలో 'శ్రీబయో'

క్యాన్సర్ నివారణకు ప్రభుత్వంతో పాటు టీటీడీ సహాయ సహకారాలు అందిస్తోంది. ప్రస్తుతం స్విమ్స్ క్యాన్సర్ విభాగం కోసం రూ118 కోట్లతో నూతన భవన నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. అత్యాధునికమైన వైద్య సదుపాయాలతో 391 పడకలతో పూర్తి స్థాయిలో శ్రీ బాలాజి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ (శ్రీబయో)ని జనవరిలో అందుబాటులోకి తీసుకురానున్నారు. క్యాన్సర్ విభాగానికి టీటీడీ రూ184 కోట్ల నిధులు కేటాయించింది. ఈ విభాగంలో లీనియర్ యాక్సలేటర్‌కు రూ24కోట్లు వెచ్చిస్తున్నారు. పెట్, గామా స్కాన్ : రూ23కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇంకా సీఎస్ఎస్‌డీ : రూ14కోట్లు, ఎంఆర్‌ఐకి రూ8కోట్లు వ్యయం చేస్తున్నారు.

ఏడాదికి 3వేలు పైనే

గత మూడేళ్ల గణాంకాల ప్రకారం ప్రతిఏటా సుమారు 3వేల నుంచి 3500 కొత్త క్యాన్సర్ కేసులు గుర్తిస్తున్నారు. తిరుపతి జిల్లాలో నోటి(ఓరల్), బ్రెస్ట్ (స్తన), సర్వికల్, ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మహిళల్లో బ్రెస్ట్, గర్భాశయంలో క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

స్విమ్స్‌లో ఇవి ఉన్నాయి

క్యాన్సర్ రోగుల సౌకర్యార్థం స్విమ్స్‌లో ఓ ఎంఆర్ఐ, సిటి, పెట్ స్కాన్‌తో పాటు తాజాగా గామా కెమెరా, లినాక్ వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వీటికి అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్బీ)) అనుమతులు ప్రక్రియ కొనసాగుతోంది. అనుమతులు లభించిన వెంటనే ఈ యంత్రాలను జనవరి నుంచి అందుబాటులోకి తీసుకుని రావడానికి ప్రణాళికలు రూపొందించారు.

పాలియేటివ్ కేర్:

చికిత్సకు లొంగకుండా చివరి దశలో ఉన్న రోగులకు పాలియేటివ్ కేర్ చాలా ముఖ్యం. స్విమ్స్‌లో క్యాన్సర్ పేషంట్ల కోసం పాలియేటివ్ కేర్ (ఉపశమన చికిత్స) విభాగం ఉంది. ఇప్పటి వరకు ఈ విభాగం ద్వారా దాదాపు 610 మంది క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు వివిధ ఉపశమన చికిత్సలు అందించారు. భవిష్యత్తులో దీనిని మరింతగా విస్తరించబోతున్నారు.

స్వీకార్‌లో ఇలా..

శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్(స్వీకార్), టాటా ట్రస్టు ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు స్తన క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ కోసం ఉచిత స్క్రీనింగ్ చేస్తున్నారు. ఇప్పటివరకు 60వేల మందికి పైగా వ్యక్తులు ఈ స్క్రీనింగ్ సేవలను పొందారు.

- ఓపీడీ : 152657
- కీమోథెరపీ : 32405
- రేడియేథెరపీ : 49608
- బ్రాకీ థెరపీ : 996
- సర్జరీలు : 3537

జిల్లాలో ఎక్కువగా కనిపించే క్యాన్సర్లు: స్తన (బ్రెస్ట్), గర్భాశయ ముఖద్వార, నోటి, ఊపిరితిత్తులు, కడుపు, పెద్దపేగు క్యాన్సర్లు.

ఇవి అవసరం

క్యాన్సర్ చికిత్సలో జరుగుతున్న పరిశోధనల ఫలితంగా అనేకరకాల ఆధునిక సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇందులో భాగంగా తిరుపతికి పీడియాట్రిక్ ఆంకాలజీ (శిశు క్యాన్సర్ వైద్యం), బీఎంటీ (బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్) ఎముకమజ్జ మార్పిడి , రేడియోఆక్టివ్ అయోడిన్ చికిత్స విభాగాలు అవసరమని వైద్యనిపుణులు చెబుతున్నారు. టీటీడీ ముందుకొచ్చి వీటిని కూడా అందుబాటులోకి తీసుకొస్తే క్యాన్సర్ బాధితులకు వరప్రసాదినిగా మిగిలిపోతుంది.

ఆస్తి నష్టం రూ.30 కోట్లు!

- 2 వేల ఎకరాల్లో ఇసుక మేట
- ముంపునకు గురైన 700 కుటుంబాలు
- ప్రభుత్వానికి తాత్కాలిక నివేదిక
- కట్ట నిర్వహణలో నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్







తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం పాతపాళెం వద్ద ఓళ్లూరు చెరువు కట్ట గురువారం తెగడంతో సుమారు రూ.30 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేశారు. కళత్తూరు హరిజనవాడలో 700 కుటుంబాలు ముంపునకు గురికాగా, ఎస్ఎల్‌పురంలో 40, పాతపాళెంలో 300 కుటుంబాలకు పాక్షికంగా నష్టం వాటిల్లింది. కళత్తూరు దళితవాడలో సుమారు 200మూగజీవాలు కొట్టుకుపోయినట్లు అంచనా. ఓ కుటుంబానికి రూ.లక్షకుపైగా నష్టం వాటిల్లింది. రాయలచెరువు కట్ట శాశ్వత నిర్మాణానికి రూ.6కోట్లకు పైగా అవసరం. కేటీ రోడ్డు నుంచిదిగువపురం వద్ద కల్వర్టు, రోడ్లు దెబ్బతిన్నాయి. తాత్కాలిక మరమ్మతులకు రూ.20లక్షలు.. శాశ్వత మర్మతులకు అయితే రూ.3కోట్లు అవసరం కానుంది. 170 కరెంటు స్తంభాల కూలిపోయాయి. చెరువు దిగువ భాగాన రెండు వేల ఎకరాల్లో ఇసుక మేట వేయగా, కొన్ని చోట్ల కోతకు గురయ్యాయి. 60 ఎకరాల్లో వేరుశనగ కొట్టుకుపోయింది. దాదాపు వెయ్యి కుటుంబాలు బాధితులుగా నిలిచారు. కలెక్టర్ వెంకటేశ్వర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి గురువారం రాత్రి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఇక 200మంది పంచాయతీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన కళత్తూరు గ్రామంలో పారిశుధ్య పనులుచేపట్టారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీపీవో సుశీలాదేవిఅక్కడే బస చేసి బాధితులకు అన్ని సహాయ సహకారాలు అందించేందుకు చర్యలుచేపడుతున్నారు. చనిపోయిన ఆవు, గేదెకు, రూ.50వేలు, మేకకు రూ.7,500 వంతున నష్టపరిహారం అందజేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ముంపునకు గురైన ప్రతి కుటుంబాన్నీ ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం రాత్రి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. వైద్య సేవలతో పాటురిలీఫ్‌సెంటర్లతో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. దెబ్బతిన్న ఇళ్లకు హౌసింగ్ పథకం కింద నిర్మిస్తామన్నారు. చెరువు కట్ట తెగడంలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు ఉంటాయని చెప్పారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్

పోలీసు ఆన్ రెస్క్యూ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కళత్తూరు దళితవాడలో సహాయక చర్యలకోసం పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సీఐలు, ఎస్ఐలు, కేవీబీపురం, సత్యవేడు, పిచ్చాటూరు, పోలీసు స్టేషన్ల సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని గ్రామస్థుల సహాయంతో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఘటనాస్థలికి చేరకుని పరిస్థితిని పరిశీలించారు. ఎప్పటి కప్పుడు నీటి మట్టం మార్పులను గమనిస్తూ గ్రామస్తులతో మాట్లాడారు. పోలీసు అధికారులు, ఇతర శాఖల సిబ్బందితో కలసి సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు 500 ఇళ్లు నీట మునిగే పరిస్థితి ఏర్పడినా సమయోచిత చర్యలతో ప్రజలను సురక్షితంగా తరలించగలిగామని ఎస్పీ చెప్పారు. అత్యవసర పరిస్థితిలో డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎస్పీ

నీటిపాలైన బతుకు

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలంలో గురువారం రాయలచెరువు కట్ట తెగడంతో కళత్తూరు దళితవాడ జనం తీవ్రంగా నష్టపోయారు. ఎటు చూసినా ఆవేదనే. 700 కుటుంబాల వరకు ముంపునకు గురయ్యాయి. బాధితుల ఆవేదన వారి మాటల్లోనే..

భారీగా పశు నష్టం



నేను నెల్లూరులో పశువైద్య విద్య అభ్యసిస్తున్నా. పశువుల పెంపకంపై ఆసక్తితో దేశవాళీ రకమైన ఒంగోలు జాతి ఆవులు, ఎద్దులు, పాడిగేదెలను ఇంటి వద్ద మేపుతుంటా. పది ఒంగోలు ఆవులు, నాలుగు ఒంగోలు జాతి పాడిగేదెలు, 16మేకలు నీటిలో కొట్టుకుపోయాయి. ఏం చేయాలో దిక్కు తోచడంలేదు.

\- సునీల్

కూడు దొరికే మార్గమేదీ?



గేదెల ద్వారా పాలు అమ్ముకుని ఇద్దరు ఆడబిడ్డలను చదివించుకుంటున్నా. ఆ నాలుగు గేదెలు ఒకేసారి కడతేరిపోయాయి. రేపటి నుంచి మా కుటుంబానికి కూడుదొరికే మార్గంలేదు.

\- సుకన్య


మొదటిఇల్లు మాదే



సెల్‌ఫోన్ల ద్వారా చెరువు తెగిన విషయం తెలిసి జనాలు పరుగెత్తారు. నాకు ఫోన్ లేకపోవడంతో ఆలస్యంగా తెలిసింది. మాది రేకుల ఇల్లు కావడంతో బిడ్డలను తీసుకుని ఎక్కడికి పోవాలో అర్థం కాలేదు. దక్షిణ వైపు నుంచి పొలాల్లో నీటి ప్రవాహం పరుగులుపెడుతున్న దృశ్యం కనిపించింది. ఇంట్లో ఉన్న ఇద్దరు బిడ్డలను సంకన వేసుకుని ఊరిలోకి పరుగులు తీసి ఓ మిద్దెపైకి ఎక్కా. మొదట నీటి ప్రవాహం మా ఇంటినే తాకింది. ఏ వస్తువూ మిగలలేదు.

\- సంపూర్ణమ్మ

ఎలా బతకాలి?



నాలుగు ఇనుప రేకులతో చుట్టూ తడికలుగా పెట్టుకుని బతికే నిరుపేద కుటుంబం మాది. నీటి ప్రవాహంలో తట్టా బుట్ట కొట్టుకుపోయాయి. నాలుగు పాత గుడ్డలు తీసుకుని రోడ్డున పడ్డాం. ఎలా బతకాలో అర్థం కావడంలేదు.

\- రఘునమ్మ

50 ఏళ్లక్రితం ఇలాంటి ఘటనే



50ఏళ్ల క్రితం ఇలాంటి ఘటనే జరిగింది. కానీ ఇంత నష్టం లేదు. అప్పుడూ రాయలచెరువు నీళ్లు మా దళితవాడపై పడింది. నీటి ఉధ్రుతి తక్కువ కావడంతో కాలువ పొంగి ప్రవహించింది. కానీ ఇంతటి విపత్తు ఎపుడూ ఊహించలేదు.

\- మోషయ్య

అందరినీ అప్రమత్తంచేశాం



రాయలచెరువు కట్టకు బొగడ పడిందని పాతపాళెం నుంచి బంధువులు ఫోనుచేసి చెప్పారు. నాతో పాటు కళత్తూరు నుంచి 20మందినితోడుపెట్టుకుని ద్విచక్ర వాహనంలో చెరువు వద్దకెళ్లాం. మా కళ్లముందే నీటి ఉధృతి పెరిగి చెరువుకట్ట తెగిపోయింది. దీంతో ఇళ్లు వదిలి పారిపోవాలంటూ అందరికీ సెల్‌ఫోన్‌తో హెచ్చరికలు చేయడంతో మిద్దెలు ఎక్కి ప్రాణాలను కాపాడుకున్నారు.

\- అమాసయ్య

దాచుకున్న సొమ్ము పోయింది



నాకు ఇద్దరు ఆడ పిల్లలు. చిల్లర దుకాణం ఉంది. ఇటీవల కొత్త ఇంటి నిర్మాణం చేపట్టా. దీనికి రూ.3లక్షలు నగదు, కొంత బంగారు నా దుకాణంలో ఉంచుకున్నా. దీంతో పాటు వస్తువులు మొత్తం పోయాయి.

\- సౌజన్య

బిడ్డకోసం తల్లడిల్లిపోయాం



నెల రోజుల క్రితం నేను మగబిడ్డకు జన్మనిచ్చా. ఊరిని ఉప్పెన తాకడంతో బిడ్డను కాపాడు కోవడానికి ఇంట్లో వాళ్లమంతా తల్లడిల్లిపోయాం. ప్రవాహం తగ్గడంతో పొరుగున ఉన్న రామగిరికి కట్టుబట్టలతో వెళుతున్నాం.

\- సుచిత్ర

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో

రెండోరోజూ ఏసీబీ సోదాలు

- పలు అక్రమ రిజిస్ట్రేషన్లు గుర్తింపు ?

రేణిగుంట నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండో రోజైన గురువారం కూడా ఏసీబీ అధికారుల తనిఖీలు కొనసాగాయి. కార్యాలయానికి తాళం వేసి మరీ రికార్డులను నిశితంగా పరిశీలించారు. తాత్కాలికంగా క్రయ, విక్రయాలను నిలిపివేశారు. తిరుపతి రూరల్ పరిధిలోని 22 ఏ నిషేధిత జాబితాలోని మఠం భూములు, శ్రీనివాసపురం, పద్మావతిపురంలోని ఇళ్ల స్థలాలకు, ఇళ్లకు డీఐజీ, జిల్లా అధికారి అనుమతి లేకుండా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డి నేరుగా వ్యక్తిగత సహాయకుడు, ఓ డాక్యుమెంట్ రైటర్, అతని తమ్ముడు ద్వారా చట్టంలోని లొసుగుల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు అధికారులు గుర్తించారు. పట్టా భూములకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములకు సదరు భూమి నెంబర్ వేసి రిజిస్ట్రేషన్లు, డబుల్ రిజిస్ట్రేషన్లు, ఇతర జిల్లాల (ఎనీవేర్) రిజిస్ట్రేషన్ చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు తనిఖీలలో గుర్తించిన అక్రమ రిజిస్ట్రేషన్లపై ప్రొసీడింగ్స్ రూపొందిస్తుండడంతో తనిఖీలు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఏసీబీ నివేదికను జిల్లా ఉన్నతాధికారులు పంపకుండా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యువకుడి దారుణ హత్య

- సంప్‌లో బయటపడిన మృతదేహం



కాళ్లు చేతులకు కట్టేసి ఉన్న మృతదేహం

రేణిగుంట నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని ఓ యువకుడు హత్యకు గురైన వైనం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం రేణిగుంట పంచాయతీ పరిధిలోని నేతాజీ కాలనీకి ఆనుకొని ఉన్న ఓ నిర్మానుష్య ప్రదేశం వద్దకు గురువారం కొంత మంది యువకులు మద్యం తాగేందుకు వచ్చారు. అక్కడి ఖాళీ భవనం నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో వారు సమీపంలోని సంపులో పరిశీలించారు. అందులో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే గాజుల మండ్యం పోలీసులకు సమాచారమిచ్చారు. డీఎస్పీ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్ఐ సుధాకర్‌లు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించారు. ఎక్కడో హత్య చేసి రెండు రోజుల క్రితం కాళ్లు చేతులు కట్టేసి మృతదేహాన్ని సంపులో పడేసి ఉంటారని డీఎస్పీ చెప్పారు. మృతదేహం గుర్తించలేని విధంగా కుళ్లిపోయిందన్నారు. మృతుడి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. హత్య కేసును ఛేదించేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. హత్యకు గురైన యువకుడు సమీ ప్రాంతానికి చెందినవాడిగా అనుమానిస్తున్నారు. అక్రమ సంబంధమా, ఆర్థిక లావాదేవీలా అనే కోణంలో విచారిస్తున్నారు. క్లూస్ టీం చేరుకుని ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని రుయాకు తరలించారు. ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూ సైకాలజీ ప్రొఫెసర్ సస్పెన్షన్

- ర్యాగింగ్‌ను ప్రోత్సహించారని అధికారుల ప్రాథమిక నిర్ధారణ



ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ సైన్స్ కాలేజీ సైకాలజీ విభాగ ప్రొఫెసర్ ఎస్.విశ్వనాథరెడ్డి సస్పెండ్ అయ్యారు. ర్యాగింగ్‌ను ప్రోత్సహించారని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఈనెల ఒకటో తేదీన సైకాలజీ విభాగంలో సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేశారని, ఇది ఆయన నిర్లక్ష్యం వల్లే జరిగిందని ఆరోపణలు వచ్చాయి. అది నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేస్తూ గురువారం నిర్ణయం తీసుకున్నారు. ఈ ఉత్తర్వులు అమలులో ఉన్నంత కాలం తిరుపతి నుంచి వెలుపలకు వెళ్లకూడదని ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లో సంబంధిత అధికారుల అనుమతి అవసరమని పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో సగం వేతనంతో జీవనాధార భత్యం చెల్లిస్తారు.

అల్లియెల్లమ్మ సేవలో రష్యన్లు



గంగాధరనెల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరులోని అల్లియెల్లమ్మ ఆలయాన్ని గురువారం రష్యాకు చెందిన తొమ్మిదిమంది సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సంప్రదాయ ప్రకారం పూలమాలలు ధరించి ఆలయంలోని నాగాలమ్మ వద్ద హోమం పూజల్లో పాల్గొన్నారు.శుక్రవారం ఉదయం గోమాత పూజల్లో వారు పాల్గొంటున్నట్లు అర్చకులు ఆనంద అయ్యంగార్, విష్ణు అయ్యంగార్ తెలిపారు.వీఆర్వోల సంఘం మాజీ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి వారి వెంట వున్నారు.

పవన్‌కల్యాణ్ పర్యటన ఇలా....

పలమనేరు, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) :ఉప ముఖ్యమంత్రి పవన్ విజయవాడనుంచి ఆదివారం ఉదయం 10గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు.అక్కడినుంచి హెలికాప్టర్‌లో 10.35గంటలకు పలమనేరు సమీపంలోని పెంగరగుంట వద్ద ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు వస్తారు.అనంతరం ముసలిమడుగు వద్దకు చేరుకుని ఎలిఫెంట్ క్యాంపును ప్రారంభిస్తారు.కుంకీలకు శిక్షణ ఇస్తున్న ప్రదేశాన్ని సందర్శిస్తారు.గజబాధిత రైతులతో మాట్లాడతారు. 12.30గంటలకు అక్కడినుంచి తిరుగుప్రయాణమవుతారు.

అధికారులతో ఎమ్మెల్యే అమర్ సమీక్ష

డిప్యూటి సీఎం పవన్‌కళ్యాణ్ పర్యటనపై గురువారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పలమనేరులో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని సూచించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, పెండింగ్ పనులకు సంబంధించి ఏదైనా సమాచారం వుంటే అధికారులు తెలియజేస్తే డిప్యూటి సీఎం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. 9వ తేది ఉదయం 10 గంటలకు ముసలిమడుగు చేరుకునే డిప్యూటీ సీఎం ఎలిఫెంట్ ఎన్‌క్లోజర్‌లో ఏనుగుల విన్యాసాలు వీక్షించిన తరువాత మావటీలు, సిబ్బందితో చర్చిస్తారని ఎఫ్ఆర్‌ఓ నారాయణ వివరించారు. అక్కడినుంచి ఎలిఫెంట్ క్రాల్ సందర్శన, అభిరామియా ప్లాంట్‌లో చెట్లు నాటడం జరుగుతుందన్నారు. తదనంతరం రైతులతో రచ్చబండ కార్యక్రమం, చివరగా అన్ని శాఖల అధికారులతో సమీక్ష వుంటుందని అమరనాథ రెడ్డికి అధికారులు వివరించారు.

నేడు పాఠశాలల్లో సమూహ వందేమాతర గీతాలాపన

చిత్తూరు సెంట్రల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు సమూహంగా వందేమాతర గీతాలాపన చేయాలని డీఈవో వరలక్ష్మి గురువారం ఆదేశాలు జారీ చేశారు. వందేమాతరం గీతాన్ని రచించి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి పాఠశాలలో సమూహంగా ఆలపించాలన్నారు.

దూడను చంపిన చిరుత



చిరుత పాదముద్రలు

ఐరాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలం వడ్రాంపల్లె గ్రామంలో బుధవారం రాత్రి ఓ దూడను చిరుత చంపేసింది. పాడి రైతు కిషోర్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. తన పాడి ఆవును రాత్రి ఇంటి వద్ద కట్టేశాడు. దూడను ఇంటికి అర కిలోమీటరు దూరంలోని వ్యవసాయ పొలం వద్ద కట్టేశాడు. ఈ క్రమంలో దూడపై చిరుత దాడి చేసి చంపి.. తినేదింది. విషయం తెలుసుకున్న చిత్తూరు అటవీశాఖ డీఆర్వో కరణ్‌సింగ్ గురువారం సంఘటనా స్థలానికి విచ్చేశారు. అక్కడ చిరుత పాదముద్రలను గుర్తించారు. రైతులు తమ పశువులను వ్యవసాయ క్షేత్రాల వద్ద ఉంచొద్దని సూచించారు.

వరసిద్ధుడి సేవలో బాయిలర్ల దాత



దాతకు వరసిద్ధుడి జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో నూతన అన్నదాన భవనానికి ఇటీవల రూ.36 లక్షల వ్యయంతో స్టీమ్ బ్రాయిలర్లను వితరణ చేసిన దాత బెంగళూరుకు చెందిన మురళీకృష్ణ, మహేశ్వరి గురువారం వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వీరిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈవో రవీంద్ర బాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు రహమాన్ ఖాన్ ఎంపిక



బంగారుపాళ్యం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాలుర విభాగంలో అండర్-19 జాతీయ వాలీబాల్ జట్టుకు బంగారుపాళ్యంకు చెందిన దావూద్ ఖాన్ కుమారుడు రహమాన్ ఖాన్ ఎంపికయ్యాడు. ఇటీవల 69వ స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆఫ్ ఇండియా పలమనేరులో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో రహమాన్ ఖాన్ ప్రతిభ చూపడంతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఈనెల 12వ తేదీన మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ఆడనున్నట్లు మాజీ డీఎస్‌డీవో సుదర్శన్‌నాయుడు గురువారం తెలిపారు.

జగన్ డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తున్నారు

- శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత జగన్ రెడ్డి డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తున్నారని శాప్ చైర్మన్ రవినాయుడు విమర్శించారు. విశాఖలో వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండారెడ్డి విద్యార్థులకు గంజాయి విక్రయిస్తూ దొరికిపోయినా పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోవడం ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అమ్ముతూ దొరికిపోతే ఎలా తప్పించుకోవాలో శిక్షణ ఇచ్చేందుకే తాడేపల్లిలో వైసీపీ యువజన విభాగం నేతలతో జగన్ సమావేశమయ్యారని ఎద్దేవా చేశారు. వైసీపీ అంటేనే డ్రగ్స్ గంజాయి పార్టీ అని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ఏపీని డ్రగ్స్ గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ సమావేశంలో టీఎన్‌ఎస్ఎఫ్ నేత హేమంత్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

నీతి అయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ నేడు రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నీతి అయోగ్ సభ్యులు వీకే సారస్వత్ శుక్రవారం తిరుపతికి రానున్నారు. ఉదయం 11 గంటలకు ఎస్వీయూ సెనేట్ హాల్లో రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ద ఇంజన్ ఆఫ్ వికసిత భారత్-2047 అంశంపై సదస్సు ప్రారంభమవుతుంది. ఇందులో వీకే సారస్వత్ ప్రసంగిస్తారు.

కొని....తినేదెలా?

- భగ్గుమంటున్న కూరగాయల ధరలు
- అధిక వర్షాలే కారణమంటున్న వ్యాపారులు
- రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం

చిత్తూరు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి.పది రోజుల వ్యవధిలోనే ధరలు బాగా పెరిగిపోవడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాలతో పాటు సరిహద్దులోని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి జిల్లా మార్కెట్లకు కూరగాయలు వస్తుంటాయి . అయితే ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పొలాల్లో నీరు చేరడంతో కాయగూరలకు తెగుళ్లు సోకాయి. సగం పంట పొలాల్లోనే కుళ్లిపోగా.. మిగిలిన పంట తెగుళ్ల కారణంగా పాడైపోయింది.దీంతో అవసరం మేరకు మార్కెట్‌కు కూరగాయలు రాకపోవడంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి.గత వారంతో పోలిస్తే ధరలు రెట్టింపయ్యాయి. ఈ వారం పది రోజులు పెళ్లిళ్ల సీజన్ కావడంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.



కాయగూరలు కిలో ధర	ప్రస్తుతం	గతవారం
వంకాయలు	120	70
బీన్స్	70	40
క్యారెట్	100	50
బీట్‌రూట్	60	40
కాలీఫ్లవర్	100	55
కాకరకాయలు	80	60
బెండకాయలు	65	40

మాజీ మంత్రి రోజాకు పరాభవం

- వడమాలపేట ఎంపీపీపై వీగిన అవిశ్వాస తీర్మానం
- డుమ్మా కొట్టిన నలుగురు ఎంపీటీసీలు

తిరుపతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సొంత నియోజకవర్గంలో అందునా సొంత పార్టీలోనే మాజీ మంత్రి రోజాకు మరోసారి పరాభవం ఎదురైంది. నగరి నియోజకవర్గ వైసీపీలో గత ఐదేళ్లుగా బలమైన నేతలను వ్యతిరేకం చేసుకుని పలుమార్లు పార్టీపై పట్టు కోల్పోయే పరిస్థితి తెచ్చుకున్న ఆమె తాజాగా వడమాలపేట ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం విషయంలో కూడా ఎదురుదెబ్బ తిన్నారు. వడమాలపేట మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలున్నాయి. అందులో కోర్టు కేసుల కారణంగా రెండు స్థానాలకు ఎన్నికలు జరగలేదు. ఎన్నికలు జరిగిన ఏడు స్థానాలనూ వైసీపీయే గెలుచుకుంది. ఎంపీపీ పదవి బీసీ మహిళకు రిజర్వు చేసింది ప్రభుత్వం. ఏడుగురిలో వడమాలపేట ఎంపీటీసీ విజయలక్ష్మి ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఎంపీపీ ఎన్నిక సందర్భంలో ఇద్దరు పదవిని ఆశించడంతో మధ్యేమార్గంగా తొలి రెండున్నరేళ్ళు విజయలక్ష్మి, మలి రెండున్నరేళ్ళూ ఏఎం పురం ఎంపీటీసీ పుష్పలత ఎంపీపీగా కొనసాగేలా పార్టీలో అంతర్గతంగా ఒప్పందం కుదిరినట్టు సమాచారం. ఇదంతా అప్పటి మంత్రి రోజా సమక్షంలోనే జరిగినట్టు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. అయితే రెండున్నరేళ్ళు కాదు కదా ఇప్పటికి నాలుగేళ్ళు దాటినా ఎంపీపీ పదవి మార్పిడి ఒప్పందం అమలు కాలేదు. దీనిపై ఎన్నిసార్లు పంచాయితీలు జరిగినా ఒప్పందం మేరకు ఎంపీపీ పదవీ మార్పిడి జరగలేదు. దీంతో ఏడుగురు ఎంపీటీసీలలో ఎంపీపీ మినహా మిగిలిన ఆరుగురూ కలసి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలన్న నిర్ణయానికి వచ్చారు. ఈ విషయంలో మాజీ మంత్రి రోజా మద్దతు ఈ ఆరుగురికీ వుందన్న ప్రచారం జరిగింది. ఆమె సూచనల మేరకే గత నెల 15వ తేదీన ఆరుగురు ఎంపీటీసీలూ తిరుపతి ఆర్డీవో రామ్మోహన్‌ను కలసి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై స్పందించిన ఆర్డీవో గురువారం వడమాలపేట మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. తనపై అవిశ్వాస తీర్మానం కనుక ఎంపీపీ విజయలక్ష్మి సమావేశానికి రాలేదు. మిగిలిన ఆరుగురిలో ఎంపీపీ పదవి ఆశిస్తున్న ఏఎం పురం ఎంపీటీసీ పుష్పలత, పత్తిపుత్తూరు ఎంపీటీసీ ప్రతిమ మాత్రమే హాజరయ్యారు. రోజా సూచనల మేరకు ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చిన ఆరుగురిలో నలుగురు సమావేశానికి డుమ్మా కొట్టారు. కోరం లేకపోవడంతో ఎంపీపీ విజయలక్ష్మిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని, ఎంపీపీగా ఆమే కొనసాగుతారని ప్రకటించి ఆర్డీవో రామ్మోహన్ సమావేశం ముగించారు. ఈ పరిణామం రోజాకు రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది. మంత్రిగా వున్నపుడే నియోజకవర్గంలో పలువురు బలమైన వైసీపీ నేతలు ఆమెతో విభేదించారు. ఆమెపై పలుమార్లు పార్టీ అధినేత జగన్‌కు ఫిర్యాదులు చేశారు. టికెట్ ఇవ్వొద్దని గట్టిగా పట్టుబట్టారు. తమమాట నెగ్గకపోవడంతో వారిలో పలువురు గత ఎన్నికల సమయంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. తనను వ్యతిరేకించిన పలువురు నాయకులు పార్టీని వీడినా కూడా రోజాకు నియోజకవర్గంలో సొంత పార్టీపై ఇంకా పట్టు రాలేదనడానికి వడమాలపేట ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం వంటి తాజా వ్యవహారమే నిదర్శనం.

పొలాలపై ఏనుగుల మంద బీభత్సం

- మామిడి, వరి, కొబ్బరి పంటలకు అపారనష్టం





ధ్వంసమైన టమోటా పంటను చూపుతున్న కౌలు రైతు దామోదర్- ధ్వంసమైన వరిపంటను చూపుతున్న వెంకటస్వామి

కల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో రోజూ పంటలపై ఏనుగుల మంద బీభత్సం సృష్టిస్తున్నాయి. రాత్రి వేళల్లో గజరాజుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అన్నదాతలపై కన్నెర్ర చేస్తున్న గజ రాజులు పంటలకు అపారనష్టం కలిగిస్తున్నాయి. అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని రైతులు పంటలపై ఏనుగులు దాడులు చేయడం పరిపాటిగా కొనసాగిస్తుండటంతో క్షణక్షణం భయం గుప్పిట్లో కాలం గడుపుతున్నారు. బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించాల్సిన అటవీశాఖ తూతూ మంత్రంగా పరిహారం చెక్కులు అందిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని దేవళంపేట, అయ్యావాండ్లపల్లి పంచాయతీల్లో బుధవారం రాత్రి మామిడి, వరి, కొబ్బరిచెట్లపై ఏనుగుల మంద దాడులు చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. బుధవారం పగలంతా దేవళంపేట పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లి సమీపంలోని మామిడితోటలో తిష్ఠ వేసిన 16 ఏనుగులు సాయంత్రం చీకటి పడే సమయానికి తోటలో నుంచి పొలాల వైపు అడుగులు వేశాయి. బాలిరెడ్డిగారిపల్లి, మునిరెడ్డిగారిపల్లి, నల్లగుట్టపల్లి, దిన్నెబెస్తపల్లి, చెరుకువారిపల్లి, వీకేపల్లి, కుమ్మరిపల్లి గ్రామాల్లో టమోటా, వరి, మామిడి, క్యాలీఫ్లవర్ పంటలను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి తూర్పు విభాగం అడవిలోకి ఏనుగులు చేరుకున్నాయి. గురువారం పగలంతా సూరప్పచెరువు వద్ద ఏనుగులు తిష్ఠ వేసినట్లు ప్రజలు తెలిపారు. ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటలను గురువారం ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవో మధుబాబు ట్రాకర్స్‌తో కలిసి పరిశీలించారు. అటవీ ప్రాంతం సరిహద్దులోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

సదుం సీహెచ్‌సీలో తనిఖీలు



బయో మెడికల్ వేస్టేజ్ డంప్‌ను పరిశీలిస్తున్న జోయా అలీ రిజివి

సదుం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో పరిస్థితిని పరిశీలించడానికి వచ్చిన కేంద్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కామన్ రివ్యూ మిషన్ బృందం గురువారం సదుం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించింది.డాక్టర్ జోయా అలీ రిజ్వీ నేతృత్వంలోని ఈ 12మంది సభ్యుల బృందం ఆసుపత్రిలోని స్కానింగ్, డాగ్ బైట్స్, హార్ట్ స్ట్రోక్స్ కేసుల వివరాలు, ల్యాబ్‌లో నిర్వహిస్తున్న టెస్టులు, రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలను, వినియోగిస్తున్న వైద్య పరికరాలను పరిశీలించారు. నవజాత శిశువు, తల్లికి అందుతున్న వైద్య సేవలు, వైద్యులు అందించాల్సిన సూచనలు, ఆరోగ్య జాగ్రత్తలు తదితర అంశాలపై వైద్య సిబ్బందితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ దశలో ఉన్న పోస్టుమార్టం, డయాలసిస్ గదుల పురోగతి, బయో మెడికల్ వేస్టు డంపింగ్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఆసుపత్రి స్థాయికి తగిన వైద్యులు, పరికరాలు, ఎమర్జన్సీ జనరేటర్, నిర్వహణ నిధులు అవసరమని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం చెరుకువారిపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. సురక్షిత కాన్పులు, టీబీ కేసులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషకాహారం తదితర అంశాలపై రోగుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. జిల్లా జాయింట్ డైరెక్టర్ నిర్మల గ్లోరీ, డీసీహెచ్ఎస్ పద్మాంజలి, సదుం సీహెచ్‌సీ వైద్యాధికారి హరిప్రసాద్ రాజు, వైద్యులు పుష్పకుమారి, సుజిత, అజిత, కృష్ణ సుధ, షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఇనాం డీటీ పోస్టు చిత్తూరు నుంచి తిరుపతికి బదలాయింపు

తిరుపతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకూ చిత్తూరు జిల్లాలో ఉన్న ఇనాం డిప్యూటీ తహసీల్దారు పోస్టును రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి జిల్లాకు బదలాయిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో తొలినుంచి ఇనాం డీటీ పోస్టు కొనసాగుతోంది. ఇనాం ఎస్టేట్ అబాలిషన్ యాక్ట్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇనాం భూములపై హక్కు పత్రాలు కలిగిన వారి దరఖాస్తులపై విచారించి సక్రమమని తేలితే రైత్వారీ పట్టాలు మంజూరు చేసే అధికారం ఐడీటీలకు ఉంటుంది. అలాగే ఇనాం భూములకు సంబంధించిన రికార్డులన్నీ కూడా ఐడీటీ ఆధీనంలోనే ఉంటాయి. ప్రభుత్వ నిర్ణయాలు, కోర్టు కేసుల్లో కూడా ఐడీటీల పాత్ర కీలకం. అయితే 2022లో జిల్లాల పునర్విభజన జరిగాక తిరుపతి జిల్లా ఏర్పాటు కాగా ఐడీటీ పోస్టు మాత్రం మంజూరు కాలేదు. ప్రస్తుత చిత్తూరు జిల్లాలో ఇనాం భూములు పెద్దగా లేవు. ఇనాం భూములు ఉన్నదంతా ప్రస్తుత తిరుపతి జిల్లా పరిధిలోనే. ప్రత్యేకించి తిరుపతి అర్బన్, రూరల్, రేణిగుంట, చంద్రగిరి తదితర మండలాల్లో వేల ఎకరాల ఇనాం భూములున్నాయి. ఈ భూములకు సంబంధించిన వివాదాలు కూడా ఇక్కడే అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి ఇనాం భూముల వ్యవహారాలలో కీలక పాత్ర పోషించాల్సిన ఐడీటీ పోస్టు లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ గతేడాది డిసెంబరులో ప్రభుత్వానికి లేఖ రాశారు. ఐడీటీ పోస్టు లేనందున పాలనాపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని లేఖలో పేర్కొన్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం చిత్తూరు జిల్లా ఐడీటీ పోస్టును తిరుపతి జిల్లాకు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్రపతి పర్యటనలో లోపాలుండకూడదు

- టీటీడీ అదనపు ఈవో

తిరుమల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి లోపాలూ ఉండకూడదని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులకు సూచించారు. రాష్ట్రపతి ఈనెల 20వ తేదీన తిరుచానూరు అమ్మవారిని దర్శించుకుని, తిరుమలకు చేరుకుంటారు. రాత్రి తిరుమలలోనే బసచేసి 21వ తేదీన ముందుగా వరాహస్వామిని, ఆ తర్వాత శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారు. ఈ క్రమంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అదనపు ఈవో వివిధ విభాగాల అధికారులతో గురువారం తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో సమీక్షించారు.

శ్రీవారి సారె ట్రయల్ రన్ విజయవంతం



గజరాజులపై శ్రీవారి సారె ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

తిరుచానూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు పంచమి తీర్థం నాడు తిరుమల నుంచి అమ్మవారికి ఏటా శ్రీవారి సారె తీసుకొస్తారు. తిరుపతిలోని కోమలమ్మ సత్రం నుంచి తిరుచానూరుకు గజరాజులపై ఊరేగింపుగా తీసుకువస్తారు. పంచమి తీర్థం నాడు అశేష భక్తజన కోటి తిరుచానూరుకు వస్తుంది. ఏనుగులు బెదరకుండా ముందస్తుగా ఆ మార్గాన్ని వాటికి పరిచయం చేయడానికి శ్రీవారి సారె ట్రయల్ రన్ నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా గురువారం ఉదయం నగరంలోని చెన్నారెడ్డి కాలనీ నుంచి శ్రీవారిసారె ఊరేగింపు ట్రయల్ రన్ నిర్వహించారు. గజరాజులపై నమూనా సారెను ఊరేగింపుగా కోదండరామాలయం, చిన్నబజారు వీధి, గోవిందరాజస్వామిగుడి, బండ్లవీధి, ఆర్టీసీ బస్టాండు, పూర్ణకుంభం సర్కిల్ మీదుగా పద్మావతీపురం, శిల్పారామం మీదుగా అమ్మవారి ఆలయం వరకు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవోలు హరీందర్‌నాథ్, శాంతి, వీజీవో గిరిధర్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, ఏఈవో దేవరాజులు, అర్చకుడు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుభాస్కర్ పాల్గొన్నారు.

13న 'సివిల్ సర్వీసెస్' ఆటల పోటీలు

చిత్తూరు క్రీడలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా వాయిదాపడ్డ ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఆటల పోటీలు ఈనెల 13వ తేదీన చిత్తూరులోని డీఎస్‌ఏ మెసానికల్ మైదానంలో జరగనున్నాయి. ఈ మేరకు డీఎస్‌డీవో బాలాజి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 19 క్రీడాంశాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. గెలుపొందిన వారు ఈనెల 19 నుంచి 22వ తేదీవరకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్ లాన్ టెన్నిస్, హాకీ, టేబుల్ టెన్నిస్, కబడ్డీ, క్యారమ్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, క్రికెట్, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, స్విమ్మింగ్, వాలీబాల్, యోగా, డ్యాన్స్, మ్యూజిక్, షార్ట్‌ప్లే, రెజ్లింగ్‌లో పోటీలు నిర్వహిస్తారని వివరించారు.

పాఠశాలల పనిదినాలుగా నాలుగు నెలల రెండో శనివారాలు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు ఈనెల నుంచి నాలుగు రెండో శనివారాలు పనిచేస్తాయని డీఈవో వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొంథా తుఫాను కారణంగా నాలుగు రోజులపాటు పాఠశాలల సెలవులు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యా సంవత్సరం పనిదినాలను పరిగణనలోకి తీసుకుని ఈనెల 8, డిసెంబరు 13, వచ్చే ఏడాది జనవరి 10, ఫిబ్రవరి 14వ తేదీల్లోని రెండో శనివారాల్లో పాఠశాలలు పనిచేస్తాయని పేర్కొన్నారు. ఇందులో మినహాయింపు ఉండదన్నారు.

పునఃపరిశీలించండి : ఫ్యాప్టో

నాలుగు రెండో శనివారాలను పనిచేయాలన్న ఆదేశాలపై పునః పరిశీలించాలని కోరుతూ గురువారం డీఈవో వరలక్ష్మికి ఫ్యాప్టో నాయకులు వినతిపత్రం సమర్పించారు. స్థానిక సెలవులు వినియోగించుకుంటే 220 పనిదినాలు సరిపోతాయని చెప్పారు. ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి మునీర్, సహాయ ప్రధాన కార్యదర్శి మదన్మోహన్‌రెడ్డి, నాయకులు చిట్టిబాబు, జగదీష్, యూటీఎఫ్ రాష్ట్ర నేత జీవీ రమణ, ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయిలో వృత్తి విద్య నైపుణ్య పోటీలు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యంపై శుక్రవారం స్థానిక జ్యోతిరావు పూలే భవనంలో జిల్లా స్థాయిలో వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 14న రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. వ్యవసాయం, ఆటోమోటివ్, అప్పెరల్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఫుడ్ ప్రొసెసింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్ ఎలక్ట్రానిక్స్, ఐటీ ట్రేడ్ అంశాల్లో పోటీలు ఉంటాయని వివరించారు.

జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఆనిగానూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, నేతలు

రామకుప్పం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఆనిగానూరుకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికయ్యారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఆనిగానూరుకు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కార్తీక్, ఉదయశ్రీ, రమ్యశ్రీలు విశేష ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఆదిశేషయ్య తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారిని ప్రధానోపాధ్యాయుడితోపాటు టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి, ఎస్ఎంసీ చైర్మన్ బీరప్ప అభినందించారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



యూరియా పంపిణీ చేస్తున్న రామ్మూర్తి

రామకుప్పం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని టీడీపీ విజలాపురం యూనిట్‌ఇన్‌చార్జి రామ్మూర్తి తెలిపారు. గురువారం ఆయన మండల పరిధి ఉస్సిగానిపల్లె గ్రామ సచివాలయంలో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిరికల్చర్ అసిస్టెంట్ మంజు, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు మణేష్, నేతలు మహేంద్రనాయుడు, బీరప్ప, మంజునాథ్, ప్రభాకర్, వెంకటాచలం, సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనలతో శాంతిభద్రతలకు విఘాతం


● మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

రామకుప్పం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ పర్యటనలు రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా మారాయని మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు, ధరల పతనమైన ప్రతిసారి సీఎం చంద్రబాబు తక్షణం స్పందించి వారికి అండగా నిలుస్తున్నారని ఆయన తెలిపారు. రైతులు తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతిసారీ అండగా నిలిచి వారు త్వరగా కోలుకునేలా ప్రభుత్వం చేయూతనందిస్తోందన్నారు. అంతా అయిపోయాక దొంగలు పడ్డ ఆర్నెళ్లకు అన్న చందంగా మాజీ సీఎం జగన్ బెంగళూరు ప్యాలెస్ నుంచి వచ్చి షో చేసి వెళ్లిపోతున్నారని తెలిపారు. తన ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం రైతులను గాలికొదిలేసిందని తెలిపారు. జగన్ తన పాలనలో 3ఏళ్ల పాటు పంటల బీమా ప్రీమియంను ఎగ్గొట్టారన్నారు. జగన్ సీఎంగా ప్రచార ఆర్భాటం తప్ప రైతులకు చేసిందేమీ లేదన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ భరోసా కల్పించారని తెలిపారు. ఈ విషయంలో రాష్ట్ర రైతాంగం చంద్రబాబు పాలన తీరుపై సంతృప్తికరంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

చిత్తూరు కోర్టుకు కుప్పం టీడీపీ నేతలు

రామకుప్పం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కొళ్ళపల్లె కేసుకు సంబంధించి కుప్పం నియోజకవర్గ టీడీపీ నేతలు ఈనెల 3 నుంచి వరుస వాయిదాలకు చిత్తూరు కోర్టుకు హాజరవుతున్నారు. రామకుప్పం మండలం కొంగనపల్లె పంచాయతీ కొళ్ళపల్లెలో జరిగిన ఘటన కేసులో వైసీపీ కార్యకర్తలతోపాటు అప్పటి రాళ్ళబూదుగూరు ఎస్ఐ మునస్వామి ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు పీఏ మనోహర్‌లతోపాటు నియోజకవర్గంలోని పలువురు కీలక నేతలపై హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. కేసుకు సంబంధించి గురువారం కుప్పం నియోజకవర్గ టీడీపీ నాయకులు చిత్తూరు కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు 7, 10, 11 తేదీల్లోనూ కోర్టుకు హాజరుకానున్నట్లు నేతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు గురుకుల విద్యార్థి



సదుం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు సదుం గురుకుల పాఠశాలలోని తొమ్మిదో తరగతి విద్యార్థి భాను తేజ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. తిరుపతి తారకరామ స్టేడియంలో జిల్లా స్థాయిలో జరిగిన 17వ అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థి భాను తేజను వ్యాయామ ఉపాధ్యాయుడు శేఖర్, పాఠశాల బృందం అభినందించింది.

హైస్కూల్‌కు సీసీ కెమెరాల వితరణ

సోమల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమల హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి సదుం ఏఎస్ఐ చిన్నిన్నిగారి సత్యనారాయణ రూ.20 వేలు విలువ చేసే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. పాఠశాల ఆవరణలో ఆకతాయిల బెడద, పాఠశాల భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈక్రమంలో దాతను గురువారం హెచ్ఎం. హేమసుధాకర్, ఉపాధ్యాయులు సూర్యప్రకాశ్, అరుణ, పీడీ కరుణానిధి, మమత సన్మానించారు.

పశువుల వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు



పశువులకు మందు పిచికారీ చేస్తున్న ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడు తదితరులు

సోమల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పశువులకు సోకే వ్యాధులపై రైతులు నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలతో చికిత్సలు చేయించాలని సోమల పశుసంవర్థకశాఖ ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. గురువారం పేటూరులో జరిగిన ఉచిత పశువైద్య శిబిరంలో 195 పశువులకు పిడుదుల నివారణకు మందు పిచికారీ చేశారు. 32 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ చందనప్రియ, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, బాలాజీ నాయుడు, రెడ్డెప్ప నాయుడు, వైద్య సిబ్బంది వెంకటరమణ, అరుణ, రామకృష్ణ, సురేంద్ర, బాలకృష్ణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

సోమల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యం లేకుండా క్షేత్ర స్థాయి సందర్శనలతో వైద్యసేవలు అందజేయాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తెలిపారు. గురువారం సోమల, పెద్దఉప్పరపల్లె వైద్యశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ జయసింహ, డాక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి, వైద్యశాఖ అధికారులు, అమరనాథ్, ఉదయ భాస్కర్, గంగయ్య, చంద్రమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

కుప్పం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ లబ్ధిదారులకు శనివారం ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డా.సురేష్‌బాబు పంపిణీ చేస్తారని కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మున్సిపాల్టీ ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

రోడ్డుపై కూలిన చింత చెట్టు

● త్రుటిలో తప్పిన ప్రమాదం



చౌడేపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువపల్లె పంచాయతీ మేకలవారిపల్లె ఎంపీపీ స్కూల్ సమీపంలో బోయకొండ-చౌడేపల్లె ప్రధాన రోడ్డులో ఉన్న బస్ షెల్టర్ వద్ద గురువారం సాయంత్రం అకస్మాత్తుగా ఓ పెద్ద చింతచెట్టు కూలిపోయింది. చెట్టు చాలా కాలంనాటిది కావడంతో గాలీవాన లేకపోయినా చెట్టు మొదలులో తొర్ర పడి ఉండటంతో కూలిపోయింది. చెట్టు కూలడంతో పుంగనూరు, చౌడేపల్లె, బోయకొండ, మదనపల్లె ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వాహన రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్ ఏర్పడింది. స్కూల్ వదిలే సమయంలో పిల్లలు ఆ చెట్టు కింద, బస్ షెల్టర్ వద్ద ఉండి ఇళ్లకు వెళతారు. విద్యార్థులు ఉన్న సమయంలో చెట్టు కూలి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. మధ్యాహ్నం 3.30 ప్రాంతంలో పడటంతో బస్‌షెల్టర్ ధ్వంసమైంది. దీంతో పెను ప్రమాదం తప్పింది.

కంటైనర్ల ఢీ - డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

కుప్పం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం నడుమూరు మలుపులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కంటైనర్ డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... కుప్పం-కృష్ణగిరి రహదారిలో నడుమూరు గ్రామసమీపంలోప్రమాదకర మలుపు ఉంది. శుక్రవారం మధ్యాహ్నం ఆ మలుపులో ఎదురెదురుగా వస్తున్న మినీ లారీ, కంటైనర్ ఢీకొన్నాయి. మినీ లారీ ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా.. లారీ కంటైనర్ ముందు భాగం పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఉత్తరప్రదేశకు చెందిన డ్రైవర్ కిషోర్‌దేవ్ తీవ్రంగా గాయపడ్డాడు. కుప్పం అర్బన్ పోలీసులు అక్కడకు చేరుకుని కిషోర్‌దేవ్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జల వనరులకు జలకళ

● మొరవపోతున్న చెరువులు
● ఓ వైపు వర్షాలు.. మరో వైపు హంద్రీ-నీవా జలాలు
● సంతోషం వ్యక్తం చేస్తున్న రామకుప్పం రైతులు



నిండుకుండలా సింగసముద్రం పెద్దచెరువు



మొరవపోతున్న విజలాపురం చెరువు

రామకుప్పం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో ఓ వైపు విస్తారంగా కురుస్తున్న వర్షాలు, మరోవైపు హంద్రీ-నీవా కాలువ ద్వారా వస్తున్న కృష్ణాజలాలతో మండలంలోని జలవనరులు జలకళను సంతరించుకుంటున్నాయి. గత ఇరవై రోజులుగా మోస్తరు వర్షాలు, రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆ జలాలు చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలలోకి చేరుతున్నాయి. మండలంలోని పెద్దచెరువులైన ఎస్.గొల్లపల్లె కొత్తచెరువు, సింగసముద్రం పెద్దచెరువు, కెంచనబల్ల తోట్లచెరువులతో పాటూ చిన్న, మధ్యతరహా చెరువులు వర్షపునీటితో నిండుతున్నాయి. భారీ వర్షాలకు ఎస్.గొల్లపల్లె కొత్తచెరువు నిండుకుండలా దర్శనమిస్తోంది. కొత్తచెరువు మొరవ ఉధృతంగా ప్రవహిస్తోంది. రైతులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా అటవీ ప్రాంతంలో మంగళ, బుధవారాలు కురిసిన భారీ వర్షంతో సింగసముద్రం పెద్దచెరువు పూర్తిగా నిండి మొరవ ప్రవాహం ప్రారంభమైంది. అక్కడి నుంచి జలాలు కెంచనబల్ల తోట్ల చెరువు వైపు వెళ్తున్నాయి. అటవీ ప్రాంతంలోని 89పెద్దూరు, ముద్దనపల్లె, ననియాలతాండా, చిక్కపల్లె తాండా, బల్ల పంచాయతీల పరిధిలోని చెరవులు సైతం జలకళను సంతరించుకుంటున్నాయి. మరో వైపు హంద్రీ-నీవా కాలువ ద్వారా వచ్చిన కృష్ణాజలాలు, వర్షపునీటితో అత్తికుప్పం వీరాశీచెరువు, చింతకుప్పం, జిల్లాని చెరువులు నిండి మొరవలు పోతున్నాయి. తాజాగా బుధవారం రాత్రి హంద్రీ-నీవా జలాలతో నిండిన విజలాపురం చెరువు మొరవప్రవాహం ప్రారంభమైంది. విజలాపురం చెరు వు నుంచి జలాలు బల్ల చెరువుకు పరవళ్లు తొక్కుతూ వెళ్తున్నాయి. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సమన్వయంతోనే బంజారాల సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న బంజారా సేవా సంఘ జిల్లా అధ్యక్షుడు నాగూనాయక్

పుంగనూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బంజారాలు ఐకమత్యంతో ఉంటేనే ఏ సమస్య అయినా పరిష్కరించుకోవడానికి అవకాశం ఉం టుందని ఆల్ ఇండియా బంజారా సేవా తసంఘ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బి.నాగూనాయక్ అన్నారు. గురువారం పుంగనూరు మండలం సుగాలిమిట్టలో బంజారా సంఘ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంజారాల అభివృద్ధి, సమస్యలపై దృష్టిపెట్టాలన్నారు. ఈనెల 9న ఆదివారం ఉదయం సుగాలిమిట్ట సేవాఘడ్‌లో జిల్లా, మండల కమిటీ ప్రతినిధుల ప్రమాణ స్వీకారం జరుగుతుందని వివరించారు. జిల్లాలోని బంజారాలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.శంకర్ నాయక్, రవీంద్ర నాయక్, మనోజ్‌కుమార్ నాయక్, వెంకటేశ్ నాయక్, ఎం.నాగరాజ నాయక్, హరి నాయక్, పవన్‌కళ్యాణ్ నాయక్, రెడ్డినాయక్, బి.నాగరాజ నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నేడు మదనపల్లెలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

పుంగనూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక మదనపల్లె జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు చిత్తూరు, అన్నమయ్య జిల్లాల స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు ఎస్. బాబు, వై.నాగరాజు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 ఫుట్‌బాల్ బాలబాలికల జట్లు ఎంపిక చేయడం జరుగుతుందని, క్రీడాకారులు 2012 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించి ఉండాలని వివరించారు. ఇతర వివరాలకు ఫోన్‌నంబర్ 9502074146 ను సంప్రదించాలని కోరారు.

తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా



బాధితురాలితో కలిసి ధర్నా చేస్తున్న బీఎస్పీ నేతలు

వి.కోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం బైరుపల్లెకు చెందిన మహిళకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం తహసీల్దారు కార్యాలయం ఎదుట బాధితురాలితో కలిసి బీఎస్పీ నేతలు ధర్నా చేపట్టారు. బైరుపల్లెకు చెందిన మైనారిటీ మహిళ సారంబీకి చెందిన భూమిని కౌలుకు చేసుకుంటూ తన పేరుపై పట్టా చేసుకున్న గ్రామానికి చెందిన మునస్వామిపై, పట్టా మార్పునకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఆర్ఐ హనుమంతరావుకు వినతి పత్రం అందించారు.

పట్టుదలతోనే విద్యార్థుల లక్ష్యాలు సాధ్యం

పుంగనూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టుదల, పోటీతత్వం ఉంటే విద్యార్థులు సాధించలేనిది ఏమీ ఉండదని విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఫ్రెషర్స్ డే సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాల ప్రహరీ, ఇండోర్‌స్టేడియం ఏర్పాటుపై పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి మంత్రి లోకేశ్‌తో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు. కాలేజీకి క్రికెట్ కిట్, మైక్‌సెట్‌ను దాత బాబు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, పుదిపట్ల సర్పంచ్ రెడ్డెప్పరెడ్డి, బసవరాజ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ నాయుడు, ఆర్యవైశ్య సంఘ నాయకుడు రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ కుంగిన యాదకుంటచెరువు కట్ట

● ఆందోళనలో ఆయకట్టు రైతులు



వి.కోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం బైరుపల్లె పంచాయతీలోని యాదకుంటచెరువు కట్ట మళ్లీ కుంగిపోయింది. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. చెరువు కట్టపై రహదారి ఏర్పాటు చేసినప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో చెరువుకట్టకు గండిపడింది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కట్టకు అవతలి వైపు మట్టితోలి తాత్కాలికంగా గండికి అడ్డుకట్ట వేశారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో చెరువులోకి చెప్పుకోదగ్గ స్థాయిలో నీరు చేరడంతో గతంలో గండిపడిన చోట కట్ట కుంగిపోయింది. చెరువుకట్ట లోపలి వైపు మట్టిని తోలి ఉంటే కట్ట కుంగిపోయేది కాదని రైతులు అభిప్రాయపడుతున్నారు. కట్ట కుంగిపోవడంతో రైతులు ఆందోళనకు గురికావడమే కాకుండా యాదుకుంట గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు సత్వరం స్పందించి చెరువు కట్టకు పటిష్ఠమైన మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్తీక దీపాల వెలుగులు



వనాల్లో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

రామకుప్పం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం సుబ్రహ్మణ్యస్వామితోపాటు ఆవరణలోని పద్మావతి, వేంకటేశ్వరస్వామి, నాగుల ముద్దమ్మ, శనీశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. రాత్రికి భక్తులు ఆలయం వద్దకు చేరుకుని ఆలయాల వద్ద, వెనుకన ఉన్న త్రిమూర్తి, నక్షత్ర, నవగ్రహ, రాశీ వనాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక దీపాలతో ఆలయాలతోపాటు వనాలు వెలుగులను సంతరించుకున్నాయి. భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడుల చెల్లింపులు

సోమల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పెద్దఉప్పరపల్లె సమీప మోక్షేశ్వరస్వామి ఆలయంలో గురువారం శివమాలధారణ భక్తులు భక్తిశ్రద్ధలతో ఇరుముడుల కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలో గురుస్వామి త్రివిక్రమరావు ఆలయంలో అభిషేక పూజలు చేపట్టారు. అనంతరం 40 మంది శివమాల ధారణ భక్తులకు ఇరుముడి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు శివనామ సర్మణలతో దుర్గంకొండలో ఇరుముడులు చెల్లించారు.

నంజంపేటలో వీధి కుక్కల దాడులు

సోమల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేటలో వీధి కుక్కలు స్వైరవిహారం చేసి ముగ్గురిని గాయపరిచినట్లు ఎంపీటీసీ జిన్నా తెలిపారు. గురువారం నంజంపేట బస్టాండ్‌లో పాదచారులు హరి, తోట జ్యోతి, మల్లేశ్‌లను వీధి కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. అలాగే పలు వీధి కుక్కలు గొర్రెల మందలో చొరబడి మేకలను, గొర్రెలను గాయపరిచినట్లు తెలిపారు. అధికారులకు మండల సమావేశంతోపాటు పలు పర్యాయాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి సమష్టి కృషి



అమరనాథరెడ్డిని కలిసిన ఏఎంసీ చైర్మన్ రాజన్న, కార్యదర్శి సంజీవకుమార్

పలమనేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మార్కెట్‌కు వచ్చే రైతులకు మెరుగైన సేవలను అందించడంతో పాటు పలమనేరు మార్కెట్ కమిటీ అభివృద్ధికి నూతన పాలకవర్గం, అధికారులు సమష్టిగా కృషిచేయాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, సెక్రటరీ సంజీవకుమార్, డీఈఈగా కొత్తగా విధుల్లో చేరిన జీఎస్ వినోద్‌కుమార్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి అధికారులు, పాలకవర్గం సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. మార్కెట్ కమిటీకి సంబంధించి సమస్యలు, నిధులు అవసరం ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. సైట్ ఇంజనీరు గౌస్, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పుంగనూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం రాగానిపల్లె పంచాయతీ దిగువపల్లె వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.5 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై విద్యార్థినులకు అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పద్మావతి

బైరెడ్డిపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో గురువారం ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తీర్థం పీహెచ్‌సీ డాక్టర్ పద్మావతి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, బాల్య వివాహాలు, సీజనల్‌వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. యోగా, ధ్యానం చేయడం అలవరచుకోవాలని సూచించారు. ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, సీహెచ్‌వో సాయిదివ్య, వైద్యసిబ్బంది నాగేశ్వరి, రాధ, ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

16న మదనపల్లెలో మాలమహానాడు



పుంగనూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న మదనపల్లె సీఎస్ఐ హాల్‌లో జరిగే రాష్ట్ర మాలమహానాడు మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో మహాసభ ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాసులు, శంకర్, అఖిల్, గంగా, శ్రీను, గంగప్ప, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

● ఎమ్మెల్యే భానుప్రకాష్



మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నింద్ర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మృతుల కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం నింద్ర దళితవాడలో తెలుగుదేశం కార్యకర్త బలరాం తల్లి, అదే కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మల్లు పరదేశి మనవడు వెంకటేష్ కుమారుడు నితిన్ మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు వెంకటేశ్వరరావు, పరదేశి, భాస్కర్, శరవణ, ఏబీరాజు తదితరులున్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

నగరి: మండల పరిధిలోని గుండ్రాజుకుప్పం పంచాయతీకి చెందిన రాజులకండ్రిగ టీడీపీ నాయకుడు ధనంజయరాజును గురువారం ఎమ్మెల్యే భానుప్రకాష్ పరామర్శించారు. మోకాలి నొప్పితో బాధపడుతున్న ఆయన బర్డ్‌లో ఆపరేషన్ చేసుకోవడంతో అక్కడికెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగ రెడ్డి, నగరి పీఎస్‌సీఎస్ అధ్యక్షుడు కె.బాలాజీ, జవహర్‌రెడ్డి పాల్గొన్నారు.

నగరిలో వర్షం



నగరిలో కురుస్తున్న వాన

నగరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరిలో గురువారం తొలుత చినుకులతో మొదలై తర్వాత భారీ వర్షం కురిసింది. తుఫాన్ కారణంగా ఇప్పటికే పలు కాలనీలు బురదతో నిండి ఉన్నాయి. మళ్లీ వర్షాలు పడుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణాపురం రిజర్వాయర్ గేటు ఎత్తివేత

వెదురుకుప్పం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరగడంతో గురువారం రాత్రి ఏఈఈ భాస్కర్‌రాజీవ్ ఆధ్వర్యంలో ఓ గేటును ఎత్తి.. నీటిని దిగువకు విడుదల చేశారు. ఆ నీరు తమిళనాడుకు తరలిపోయింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. కుశస్థలీ నదీ పరివాహక ప్రాంతాల్లోకి వెళ్లరాదని సూచించారు.

తూగుండ్రంలో ఉచిత వైద్యశిబిరం

గంగాధరనెల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూగుండ్రంలో గురువారం అపోలో ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 106 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి, మందులు అందజేసినట్లు డాక్టర్ చిరంజీవిరెడ్డి తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, ఆశవర్కర్లు పాల్గొన్నారు. టీఎన్‌టీయూసీ నేత జీవరత్నం, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు బెల్లంకొండ అశోక్ నాయుడు పర్యవేక్షించారు.

గుడిపాలలో నేడు ఎమ్మెల్యే పర్యటన

గుడిపాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శుక్రవారం గుడిపాల మండలంలో పర్యటిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, పీఆర్ ఏఈ ప్రసాద్ నాయుడు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. ఉదయం తొమ్మిది గంటలకు వెంగమాంబాపురం, గట్రాళ్లమిట్ట గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారన్నారు. 10గంటలకు బొమ్మసముద్రం క్రాస్‌లో గొల్లమడుగు, పానాటూరు గ్రామాలకు కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభిస్తారని, 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, మధ్యాహ్నం 12 గంటలకు అడవిచేను గ్రామానికి నూతన ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభిస్తారన్నారు.

రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించండి

● అధికారులకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదేశం

చిత్తూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పీజీఆర్ఎస్‌లో భూసమస్యలు, రైతుల నుంచే ఎక్కువ అర్జీలు వస్తున్నాయన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని చెప్పారు. భూ సమస్యలపై అధికారులు కొందరు తూతూమంత్రంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. వీఆర్వోలు, సర్వేయర్లు తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిత్తూరు అర్బన్, రూరల్ తహసీల్దార్లు కులశేఖర్, జయప్రకాష్, డీటీ ఇబ్రహీం పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లె పంచాయతీ ఒంటిల్లు కృష్ణాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త జశ్వంత్ బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గురువారం జశ్వంత్ మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి, నివాళి అర్పించారు. కుటుంబీకులను ఓదార్చి ఆర్థిక సాయం అందించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యకర్త కుటుంబీకులకు ఆర్థిసాయం అందజేసిన జగన్మోహన్

ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయొద్దు: డీపీవో



సిబ్బందితో మాట్లాడుతున్న సుధాకరరావు

పెనుమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయద్దని ప్రజలను డీపీవో సుధాకరరావు కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ కార్మికులకు అందజేసి, సహకరించాలన్నారు. శాతంబాకం పంచాయతీలో గురువారం ఉదయం చెత్త సేకరణను పరిశీలించారు. సెక్రటరీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కత్తిరెడ్డిపల్లెలో రేషన్ సరుకుల పంపిణీ



లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెనుమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కత్తిరెడ్డిపల్లెలోని బియ్యం కార్డుదారులు కొన్నేళ్లుగా నాలుగు కిలోమీటర్లు నడిచి గాగవ్వగారిపల్లెకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకునేవారు. ఈ విషయమై 'గ్రామంలోనే రేషన్ సరుకులు పంపిణీ చేయండి' శీర్షికన గత శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు నవంబరు నెల రేషన్ సరుకులను కత్తిరెడ్డిపల్లెలోనే పంపిణీ చేయాలని డీలర్‌కు ఆదేశాలిచ్చారు. దాంతో గురువారం నుంచి గ్రామంలోనే బియ్యం పంపిణీ ప్రారంభించారు.

వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

శ్రీరంగరాజపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లోకనాథం పిళ్లై సూచించారు. గురువారం కురిసిన వర్షానికి ఎన్ఆర్‌పురానికి చెందిన గిరి పూరిగుడిసె, మంగుంట ఆదిఆంధ్రవాడకు చెందిన దివ్యాంగుడు నారాయుడి పూరి గుడిసె కూలిపోయింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

బంగారుపాళ్యం తహసీల్దార్‌గా షబ్బీర్ బాషా



బంగారుపాళ్యం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం తహసీల్దారుగా షబ్బీర్ బాషా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. ఇక్కడ పనిచేస్తుండిన బాబూ రాజేంద్రప్రసాద్ గత నెల 31వ తేదీన పదవీ విరమణ చేసిన విషయం తెలిసిందే.

టీటీడీ చైర్మన్‌కు సన్మానం



ఐరాల(కాణిపాకం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాక వరసిద్ధుడి ఆలయ చైర్మన్ మణినాయుడు కలిసి సన్మానించారు. వరసిద్ధుడి ఆలయం వద్ద అభివృద్ధి పనులకు టీటీడీ నుంచి రూ.25 కోట్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి మరింత సహకరించాలని కోరారు.

ఇద్దరి మృతి కేసులో నిందితుడి అరెస్టు



పోలీసుల అదుపులో రామరాజ్

బంగారుపాళ్యం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరి మృతి కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 3వ తేదీన బండ్లదొడ్డి అటవీ ప్రాంతంలోని మామిడితోపులో వన్యప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు మృతి చెందారు. ఈ కేసును దర్యాప్తు చేయగా అదే గ్రామానికి చెందిన కన్నయ్య కుమారుడు రామరాజ్ (32)ను నిందితుడిగా గుర్తించారు. గురువారం ఇతడిని బలిజపల్లె ఫ్లైఓవర్ వద్ద అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో వీర్వోలు రామకృష్ణ, చంద్ర, పోలీసు సిబ్బంది అజ్ఘర్, చంద్ర పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన మైలేరు పండుగ



బంగారుపాళ్యం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కురప్పల్లెలో గురువారం నిర్వహించిన మైలేరుపండుగ ప్రశాంతంగా ముగిసింది. మండల పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున యువకులు కోడెగిత్తలను తీసుకొచ్చి పోటీలో పాల్గొన్నారు. గెలుపొందిన గిత్తల యజమానులకు బహుమతులను ప్రదానం చేశారు.

'విజయం'లో నేడు రక్తదాన శిబిరం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు రోడ్డు సుందరరాజు పురంలోని విజయం విద్యాసంస్థలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినం, సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్ సెంటర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చిత్తూరు వారు దాతల నుంచి రక్తాన్ని సేకరించనున్నట్లు పేర్కొన్నారు.

మల్లాఖంబ్ రాష్ట్రస్థాయి పోటీలకు మంగళపల్లె విద్యార్థుల ఎంపిక



బంగారుపాళ్యం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ మల్లాఖంబ్ పోటీలకు మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నిఖిల్, చరణ్‌సాయి, నంద కిషోర్ ఎంపికయ్యారని హెచ్ఎం రాజ్యలక్ష్మి గురువారం తెలిపారు. వీరు ఈ నెల 7,8 తేదీల్లో గుంటూరు జిల్లా వెలిగొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. విద్యార్థులను గ్రామ సర్పంచు కుప్పాల మురళి, పీడీ సురేష్, గ్రామస్థులు, ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

10న వక్తృత్వ పోటీలు

చిత్తూరు సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ జయంతి సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాధం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీన పలమనేరు కళామందిరంలో ఈ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 8వ తేదీలోపు 93462 49011 నెంబరును సంప్రదించాలని సూచించారు.

నేడు పీఏసీఎస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

వెదురుకుప్పం,నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం పీఏసీఎస్ చైర్మన్ మాదిరాజు జనార్ధన్‌రాజు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రమాణస్వీకారం చేస్తారు. కార్వేటినగరంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ హాజరవుతారు. అలాగే శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కార్వేటినగరంలో పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం జరుగుతుంది. ముఖ్య అతిథిగా థామస్ హాజరై.. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నారు.

'రాతి కూసాలు తొలగించిన వారిపై చర్యలు తీసుకోండి'

చిత్తూరు సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ అనుభవంలో ఉన్న భూమికి రక్షణగా నిర్మించిన రాతి కూసాలపు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని చిత్తూరు మండలం టి.వేపనపల్లెకు చెందిన గుణశేఖర్ రెడ్డి, శంకర్ రెడ్డి కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పక్కభూమికి చెందిన వారు రాతి కూసాలను దౌర్జన్యంగా తొలగించి, తమ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారించి, తమకు న్యాయం చేయాలని కోరారు.

సారా విక్రేత అరెస్టు



వెదురుకుప్పం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ సారా విక్రేతను అరెస్టు చేశారు. ట్రైనీ ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల మేరకు.. కార్వేటినగరం మండలం కొటార్వేడు గ్రామ పంచాయతీ వత్తులూరు కాలనీకి చెందిన నరసింహులు సారాను అతడి ఇంటి వద్ద విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆపై నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ట్రైనీ ఎస్ఐ తెలిపారు.

గాయపడిన చినపాపమ్మ మృతి

ఐరాల(కాణిపాకం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని పండారం వీధిలో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు కూలిన ఘటనలో గాయపడిన చినపాపమ్మ(54) మృతి చెందారు. కాణిపాకం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 29వ తేదీన పండారం వీధిలోని భూలోకయ్య ఇంట్లో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వ్యాపించి చినపాపమ్మ చీరకు నిప్పు అంటుకుంది. కంగారుపడిన ఆమె పరుగున బయటకు వచ్చి ఇంటి బయట పడిపోయింది. అనంతరం సిలిండర్ పేలడంతో ఇల్లు కూలి పోయింది. గాయపడ్డ ఆమెను భర్త భూలోకయ్య, స్థానికులు చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

తెగడానికి సిద్ధంగా వెంగంపల్లె రోడ్డు



గుడిపాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 197రామాపురం సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వెంగంపల్లెకు వెళ్లే రహదారిలోని రోడ్డు తెగడానికి సిద్ధంగా ఉంది. గురువారం కురిసిన వర్షానికి వెంగంపల్లె చెరువు మొరవ పారుతోంది. ఈ నీటి ఉధృతికి వెంగంపల్లె రోడ్డు ఇప్పటికే కొంత కోసుకుపోయింది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీసీ హాస్టల్‌ను పరిశీలించిన ఆర్డీవో



విజయపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయపురంలోని బీసీ హాస్టల్‌ను ఆర్డీవో అనుపమ గురువారం పరిశీలించారు. మరుగుదొడ్లలో గీజర్లు, మరమ్మతు పనులను పర్యవేక్షించారు. అలాగే దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించాక, తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌పై ప్రత్యేకాధికారి హోదాలో అధికారులతో సమీక్షించారు. తహసీల్దార్ కిరణ్, డీటీ అశోక్, ఇన్‌చార్జి వార్డెన్ చంద్రబాబు, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, రమేష్‌రాజు, బాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు 30శాతం తగ్గకుండా మధ్యంతర భృతి ఇవ్వాలి : ఎస్టీయూ

ఐరాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీచర్లకు 30శాతం తగ్గకుండా మధ్యంతర భృతి ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి కోరారు. గురువారం ఎస్టీయూ నాయకులు మండలంలో ఉపాధ్యాయ సమస్యల సేకరణ, సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కిషోర్‌కుమార్‌రెడ్డి, హరినాథ్, సుధాకర్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.